క్లుప్తంగా

పవనసుతుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

కౌతాళం: మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో సందడి నెలకున్నాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నెలోని ఆంజనేయ స్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులగట్టు ఆంజినేయస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు.

వాహనాల వేలం



వేల పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఆదోని సెబ్ స్టేషన్‌లో 26 వాహనాలకు వేలం పాటలు నిర్వహించారు. ఇందులో 25 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 4,24,000 కాగా, వేలం పాటలో రూ.6,29, 000 తో పాటు జీఎస్టీ రూపంలో మరో రూ. 1,13,220, మొత్తం రూ.7,42,220 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఏఈఎస్ కర్నూలు రాజశేఖర్, ఎస్ఐ శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, హెచ్‌సీలు రాముడు, ఈసీలు రోహిస్‌కుమార్, సోమేష్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆదోని సెంట్రల్ : పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోనున్న పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజనం అనంతరం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 850 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని, వీరితో వారందరికీ బోధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమస్యపై ఓ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఆరో తరగతి అడ్మిషన్లు జరుగుతుండటంతో వాటిని చూసుకుంటున్నామని, దీంతో విద్యార్థులకు బోధన చేయలేకపోతున్నామని చెప్పారు. దాదాపు మరో 250 మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. డిప్యూటేషన్‌పై ఉన్న ఉపాధ్యాయుడిని వెనక్కి తీసుకున్నారన్నారు.

విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శేషాద్రి

కౌతాళం: విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు అమ్మితే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో హెడ్ కుక్ మృతి



చంద్రశేఖర్‌స్వామి (ఫైల్)

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదానం సత్రంలో హెడ్ కుక్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌స్వామి (53)గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. 20 సంవత్సరాల నుంచి సేవలు అందించిన ఆయనకు భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంద్రశేఖర్‌స్వామి మృతి పట్ల ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజుగౌడు, అసిస్టెంట్ కమిషనర్ వాణి, పర్యవేక్షకుడు మల్లికార్జున, ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, వంటవారు, ఆలయ, అర్చక సిబ్బంది సంతాపం తెలిపారు.

అవస్థలు తప్పాయి



గతంలో సబ్సిడీ విత్తనాలు పొందాలంటే పనులు మానుకొని ఆదోని పట్టణానికి వెళ్లేవాళ్లం. పనులు మానుకుని వ్యవప్రయాసాలకు గురయ్యాం. అయితే మూడేళ్లుగా అలాంటి ఇబ్బందులు తప్పాయి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో భూసార పరీక్షలుకు సిబ్బందే వచ్చి మట్టి నమూనాలు తీసుకెళ్తున్నారు. అలాగే వీలున్న సమయంలో విత్తనాలు, ఎరువులు తీసుకెళ్తున్నాం. అవన్నీ మా ఊర్లోనే స్టాకు ఉంచారు. పంటల సమయంలో వ్యవసాయ అధికారులు పొలాలను పరిశీలించి సూచనలిస్తున్నారు. ఈప్రాంతానికి అనువైన విత్తన రకాలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఈ విధానంతో మాకు చాలా ఇబ్బందులు తప్పాయి.

– వీరేష్, కోసిగి

గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు తీసుకున్నా



నాలుగేళ్ల కిత్రం వరకు మేము విత్తనాలు, ఎరువులు, మందుల కోసం ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో రెండు రోజుల క్రితం ఊర్లోనే విత్తనాలు, ఎరువులు తీసుకున్నా. రేటు కూడా బయటకన్నా తక్కువగా ఉంది. అలాగే రవాణా ఖర్చులు మిగిలిపోయాయి. ప్రస్తుతం మా ఊర్లో జీలుగ, పిల్లిపెసర, వేరుశనగ విత్తనాలు స్టాకు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా వాడే ఎరువులు ఎక్కువ తెప్పించి ఉంచారు. అలాగే నాలుగేళ్లుగా రైతు భరోసా అందింది. సేవలు మాత్రం చాలా బాగున్నాయి.

– ఉప్పర సురేష్, రైతు, అర్లబండ

- ఊరూరా రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు తప్పిన వ్యయప్రయసాలు
- స్థానికంగానే అన్ని రకాల సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రైతు ముంగిటకే సేవలు

సాగులో అడుగడుగునా అన్నదాత చేయిపట్టి నడిపిస్తూ అండగా నిలుస్తోంది ప్రభుత్వం. భూసార పరీక్షల నుంచి పంట ఉత్పత్తులను విక్రయించుకునేంత వరకు రైతన్నలతకు వెన్నంటి నిలుస్తోంది. గతంలోలా అవస్థలు పడకుండా పల్లె ముంగిటే అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచింది. సాగు చేయలేమనే స్థితి నుంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చి రైతుల అనుకూల ప్రభుత్వంగా పేరుగాంచింది.

కోసిగి: గతంలో విత్తనాలు, ఎరువులు, మందులు పొందాలంటే అదో ప్రహసనం. రోజుల తరబడి పట్టణాలు, మండల, నియోజకవర్గ కేంద్రాల వద్ద బారులు తీరి, తిండి, పనులు మానుకొని, రోజుల తరబడి అక్కడే ఉండి తెచ్చుకునే వారు. ప్రస్తుతం గ్రామంలోని ఆర్బీకేల్లో ఎలాంటి సేవలైనా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైఎస్సార్‌సీపీ వచ్చాక వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. గ్రామంలోనే వ్యవసాయానికి సంబంధించిన సేవలన్నీ అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. మట్టి నమూనాల సేకరణ నుంచి దిగుబడి విక్రయించుకునేంత వరకు రైతులకు అండగా నిలచేలా చర్యలు చేపట్టారు. ఆర్బీకే సిబ్బంది పంటల సాగులో సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించి వర్తింపజేస్తున్నారు. తనకు ఏ ఎరువులు కావాలో రైతు స్వయంగా ఆర్డర్ పెట్టుకునేలా డిజిటల్ కియోస్క్ సేవలు ప్రభుత్వం అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, ఆధునిక సమాచారం, మార్కెటింగ్, ధరలు తదితర సేవలు పల్లెలో అందుతున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలో 75 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయగా 43,586 మంది రైతులు ఉన్నారు. ఏటా ఖరీఫ్‌లో 1,40,980 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు.

ప్రయోజనాలు..

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంటల సమాచారం. ఆన్‌లైన్‌లో పంటల నమోదు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ధరలు, ఆధునిక సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం అందిస్తున్నారు. అలాగే కౌలుకు భూమిని సాగుచేసుకునే రైతులకు కౌలు రైతు కార్డులు జారీ చేస్తారు. సబ్సిడీపై వేరుశనగ, జీలుగా, పిల్లిపెసర , యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందజేస్తారు. గతంలో ఆదోని పట్టణ ప్రాంతాలకు వెళ్లి పనులు మానుకుని రోజుల తరుబడి క్యూలో వేచి ఉండి విత్తనాలు, ఎరువులు కోసం అష్టకష్టాలు పడేవారు. సబ్సిడీ యంత్రాలు, ట్రాక్టర్లు, రోటావేటర్‌లు, గన్ పంప్ నెట్స్ తదితర వాటికి దరఖాస్తు చేసుకొని పొందవచ్చు. రైతుల సంక్షేమం కోసం ప్రతి ఏటా రైతు భరోసా, పంటల బీమా, పంటల రుణాలు, తదితర పథకాలు రైతుల చెంతకే చేరుతున్నాయి.



దుద్ది గ్రామంలో కొత్త నిర్మించిన ఆర్బీకే భవనం



కోసిగి ఆర్బీకే నుంచి వేరుశనగ విత్తనాలు తీసుకెళ్తున్న రైతు

మండలాల వారీగా రైతులు, ఖరీఫ్ సాగు, రైతు భరోసా వివరాలు..

మండలం	ఆర్బీకేలు	రైతులు	ఖరీఫ్‌సాగుఎకరాల్లో	రైతు భరోసా(రూ.కోట్లలో)
మంత్రాలయం	18	8932	31,560	రూ.4,91,26,000
పెద్దకడుబూరు	18	9888	32,730	రూ. 5,43,84,000
కోసిగి	16	9664	31,240	రూ.5,31,52,000
కౌతాళం	23	15,102	45,450	రూ.8,30,61,000
మొత్తం	75	43,586	1,40,980	రూ.23,97,23,000

- నియోజకవర్గంలో 75 ఆర్బీకేలుండగా ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.21.8లక్షలు ప్రకారం కేటాయించింది. మొత్తం రూ.16.35కోట్లు మంజూరు చేసింది.
- మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా నాల్గ విడుత 43,586 మంది రైతులకు రూ.23,97,23,000 నగదు రైతుల ఖాతాల్లో జమ చేశారు. నాలుగేళ్లలో రూ.187.62 కోట్లు అందజేశారు.
- వైఎస్సార్ యంత్ర సేవా ద్వారా నియోజకవర్గంలో 68 సీహెచ్‌సీ గ్రూపులు లబ్ధి పొందుతున్నాయి. అందులో 358 రైతులకు ప్రభుత్వం రూ.7,12,58,095 విలువజేసే యంత్రాలు మంజూరు చేసింది. ఇందులో వారికి 40శాతం సబ్సిడీ రూ. 2,63,05,095 అందజేసింది. అందులో..ఒక ట్రాక్టర్ సబ్సిడీ రూ.2,98,280, ఒక డ్రైవాన్ స్ప్రేయర్ రూ. 8వేలు, కాటన్ సీడర్ రూ.54వేలు, రొటావేటర్ రూ. 35వేల చొప్పున రైతు గ్రూపులకు అందించింది.
- భూసారా పరీక్షల కోసం ఒక్కో ఆర్బీకే పరిధిలో 20 మట్టి నమూనాల చొప్పున 75 ఆర్బీకేలలో 1,500 శాంపిళ్లను సేకరించి ఎమ్మిగనూరు ల్యాబ్‌కు పంపారు.
- నియోజకవర్గంలో 940 క్వింటాళ్ల వేరుశనగ, 60 క్వింటాళ్ల పిల్లిపెసర, 35 క్వింటాళ్లు జీలుగ, 1,550 మెట్రిక్ టన్నుల యూరియా అండ్ కాంప్లెక్స్ ఎరువులు ఆర్బీకేలలో అందుబాటులో ఉన్నాయి. రైతులకు 40 శాతం సబ్సిడీపై అందజేస్తారు.
- నాలుగు మండలాల్లో 1367 మంది కౌలు రైతులు ఉన్నారు. వీరిలో గుర్తింపు కార్డులు పొందిన వారు 310 మంది.
- 310మంది కౌలు రైతులకు రైతు భరోసా అందింది. వీరికి రూ.13,500 చొప్పున మొత్తం రూ.41.85 లక్షలు ఖాతాల్లో జమ చేశారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కోసిగి మండలంలో 17 ఆర్బీకేలు ఉన్నాయి. ప్రతి ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారు. రైతులు వ్యవసాయానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఆర్బీకేల వద్ద వెళ్లి పరిష్కరించుకోవచ్చు. సబ్సిడీ విత్తనాలతో పాటు ఎరువులు, పరికరాలు, యంత్రాలు కియోస్క్ పరికరంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చు. విత్తనాల ఎంపిక,సాగులో సలహాలు అందజేస్తున్నాం. ప్రస్తుతం దిగుబడులను ఆర్బీకేల పరిధిలో విక్రయించుకోవచ్చు.

– రాజు, వ్యవసాయాధికారి , కోసిగి

నేడు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో ప్రతిభ చూపిన వాల్మీకి విద్యార్థులకు ఈ నెల 18వ తేదీన పురస్కారాలు అందజేస్తామని వాల్మీకి నాయకులు రమేష్ నాయుడు, నరసప్ప తెలిపారు. మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోనున్న వాగ్దేవి ప్రాథమిక పాఠశాలలో సంఘం సమావేశం శనివారం జరిగింది. వారు మాట్లాడుతూ ఆదోని, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా ఎస్‌ఓగా పుష్పలత



కౌతాళం: స్థానిక కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణిగా పుష్పలత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సాధారణబదిల్లో భాగంగానే కోసిగి కస్తూర్బా పాఠశాల నుంచి ఇక్కడికి వచ్చానని చెప్పారు.

విద్యా కానుక పంపిణీ

కౌతాళం: మండలంలోని బంటకుంట గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ గోపాల్ రెడ్డి, హెచ్‌ఎం వెంకటేష్ శనివారం విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు కానుకలను సద్వినియో గం చేసుకొని బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఉప సర్పంచ్ చంద్రశేకర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న డాక్టర్ అభిరూప్

కోసిగి: మండలంలోని దుద్ది– చిర్తనకల్లు గ్రామాల మధ్య శనివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు స్కూటర్లు ఢీకొని ఇద్దరి గాయాలయ్యాయి. కోసిగికి చెందిన హమీద్ దాదా, మహమ్మద్ తండ్రీ కుమారుడు కలిసి బైక్‌పై చిర్తనకల్లు గ్రామంలో పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా దుద్ది గ్రామ సమీపంలో సాతనూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై ఎరువు సంచి తీసుకెళ్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో హమీద్ దాదా, మహమ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. అక్కడ డాక్టర్ అభిరూప్ ప్రథమ చికిత్స అందించి అదే అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని రెఫర్ చేశారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.1,00,101 విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోనికి చెందిన కమ్మ వీరసేన, కమ్మ ఝాన్సీ దంపతులు ఆ మొత్తం అందజేశారని చెప్పారు. దీంతో దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం, చిత్రపటం, బాండ్ అందజేసి సత్కరించారు.అర్చకుడు లోకేరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు



మాట్లాడుతున్న డీఎం రఫిక్ అహ్మద్

ఆదోని టౌన్: విద్యార్థులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడుపుతామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ రఫిక్‌అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కళాశాలలు, పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, విద్యాలయాల సమయాలకు అనుకూలంగా బస్సులను నడుపుతామన్నారు. విద్యార్థులు విద్యార్థి బస్సు కోసం, తమ గ్రామానికి బస్సులు లేవని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే తమదృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఆదోని డిపో పరిధిలో హొళగుంద రహదారిలో రోడ్డు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థి బస్సులు నడపడంలో కొంత ఇబ్బందిగా ఉందని, అయినప్పటికీ రోజువారీ సర్వీసులతో పాటు విద్యార్థి బస్సులను నడుపుతున్నామన్నారు. ఎనిమిది విద్యార్థి బస్సులు 14 రూట్లలో నడుస్తున్నాయని, 4 వేల మంది విద్యార్థులకు బస్ పాసులు మంజూరు చేస్తున్నామని వివరించారు.

మంత్రాలయం టూ బెంగళూరుకు నాన్ ఏసీ స్లీపర్ సర్వీసు..

మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరు మీదుగా ఆదోని డిపోకు చెందిన నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు సర్వీసును కొత్తగా ప్రారంభించామని డీఎం చెప్పారు. శుక్రవారం నుంచి రాత్రి 10 గంటలకు ఈ సర్వీసు ప్రారంభమైందన్నారు. మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ కోచ్ సర్వీసును అందుబాటులోకి తెచ్చామని, బస్సులో 30 బెర్తులు ఉంటాయని తెలిపారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి



విజయ్‌కుమార్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని న్యూ చైతన్య కాలనీకి చెందిన ఓబులేష్, లలితమ్మల కుమారుడు విజయ్‌కుమార్ (45) అతిగా మద్యం సేవించి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. తల్లి, ఎస్ఐ చంద్ర తెలిపిన వివరాల మేరకు.. విజయ్ కుమార్ అతిగా మద్యం సేవించేవా డు. అప్పుడప్పుడు తల్లితో గొడవపడేవాడు. దీంతో ఆమె వేరే ఊరికి వెళ్లింది. చివరగా బుధవారం కుమారుడిని చూసింది. శనివారం ఇంటికి రాగా.. ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని, మూ డు రోజులుగా తలుపులు తీయలేదని స్థానికులు చెప్పడంతో ఆమె టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. వారు వచ్చి తలుపులు బద్దలుకొట్టి చూడగా మృతదేహం కుళ్లిపోయే దశకు చేరుకుంది. మృతి చెంది మూడు రోజులై ఉండొచ్చని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున

మంత్రాలయం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ వెంకటరమణతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, హౌసింగ్ డీఈ లాలుకృష్ణయ్యతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించిన అంశాలు, ఇంతకు వరకు ప్రారంభించిన లబ్దిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురువారంలోపు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పునాదులు వేసేలా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను భాగ్యస్వామ్యులను చేసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు.. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

జయప్రదం చేయండి

ఆదోని రూరల్ : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈనెల 18వ తేదీన చేపట్టే చలో విజయవాడను జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు, డివిజన్ కన్వీనర్ కీర, నాయకులు తిప్పన్న, గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నేడు జరగబోయే విజయవాడ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన సుంకేశ్వరి ముక్కరన్న అనే రైతుకు చెందిన రెండు గడ్డివాములు ఈనెల 9న ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి కాలిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో వైఎస్సార్ సీపీ నేత రైతుకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. మాజీ వైస్ ఎంపీపీ వెంకోబా, నాయకులు రోగప్ప, బొజ్జప్ప,రవిరెడ్డి, డీలర్ బొజ్జప్ప, నారాయణ, వీరన్నగౌడ్,నరసప్ప ఉన్నారు.

యార్డు కార్యాలయాల తనిఖీ

ఆదోని అర్బన్ : ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కార్యాలయాలను మార్కెట్‌యార్డు చైర్మన్ బి.మజర్‌అహ్మద్ శనివారం తనిఖీ చేశారు. దిగుబడులను నాణ్యత ప్రమాణాలను చూసే ల్యాబ్‌లో ఒక మెషీన్ మైనర్ రిపేరీ ఉందని సిబ్బంది తెలిపారు. పెయింటింగ్, ఫ్యాన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

బిల్లులు మాఫీ చేయించండి

కౌతాళం: ఎస్సీ ఎస్టీ కాలనీ వాసుల కరెంటు బిల్లులు మాఫీ చేయాలని బదినేహాల్ ఎస్సీ కాలనీ వాసులు కోరారు. శనివారం ఈమేరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలిసి విన్నవించారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీ వాసులకు 2014 నుంచి 2023 వరకు రూ.10,01,276 బకాయిలు ఉన్నాయని మాఫీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఆదోని టౌన్ : పట్టణంలోని 2వ వార్డుకు చెందిన బోయ రాజు ఈనెల 15న మృతిచెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10వేలు మంజూరైంది. ఆ మొత్తాన్ని మృతుడి భార్య పద్మకు కౌన్సిలర్ సురేష్, వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణ, కన్వీనర్ రఘు శనివారం అందజేశారు.

ఫారెస్టు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

ఆదోని సెంట్రల్ : కుప్పగల్ బీట్ అధికారి సమీఉల్లాను జిల్లా ఫారెస్టు అధికారి శివశంకర్‌రెడ్డి శనివారం సస్పెండ్ చేసినట్లు ఆదోని ఫారెస్టు రేంజ్ అధికారి రామచంద్రుడు తెలిపారు. గతంలో అయనపై వచ్చిన అవినీతి ఆరోపణల్లో భాగంగా విధుల నుంచి తాత్కాలికంగా తప్పించారని చెప్పారు.

ట్రై మోటారు సైకిళ్ల పంపిణీ



మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండలంలోని రాంపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దివ్యాంగులకు ట్రై మోటారు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏ వెంకట్రామిరెడ్డి,రవిచంద్రరెడ్డి ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: స్థానిక సచివాలయం–1 పరిధిలో పోలీస్ స్టేషన్ నుంచి బాలుర ఉన్నత పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పి. మురళీ మోహన్ రెడ్డి శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.7లక్షలు కేటాయించిందన్నారు. పట్టణంలోని మూడు సచివాలయాలు పరిధిలో గడప గడప కార్యక్రమం పూర్తి చేయగా హిందు బాలికల పాఠశాల ముందు భాగంలో కొత్తపేట కాలనీకి డ్రైనేజీ, సీసీ రోడ్డు, మార్కండేయ స్వామి ఆలయ కాలనీ, దొరల చావిడి నుంచి కట్టల గేరి యల్లయ్య ఇంటి వరకు రోడ్డు పనులు పూర్తి చేయించామన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాయకులు మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, మాణిక్య రాజు, మంగమ్మ, బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, ముకుంద కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నివాళి

ఆదోని టౌన్ : 2020లో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కన్యాకుమారి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో స్థానిక కార్యాలయంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయశాంతి, ఉద్యోగులు ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కన్యాకుమారి 2019 జూన్ నుంచి 2020 అక్టోబర్ ఆదోనిలో కమిషనర్‌గా పనిచేశారు. ఆ తర్వాత అనారోగ్యం కారణంగా బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటోంది. అయితే శనివారం ఉదయం కోలుకోలేక మృతిచెందింది.

ఫిల్టర్ బెడ్ పనుల పరిశీలన

పెద్దకడబూరు: మండలంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి రూ.5లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లో రూ.2లక్షలతో చేపడుతున్న ఫిల్టర్‌బెడ్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ సాయికుమార్ తో కలిసి పరిశీలించారు. అలాగే నౌనేకల్లు పైప్‌లైన్ కోసం రూ.2లక్షలు, పెనలబండ వాటర్ స్కీమ్ వద్ద రూ.లక్షతో మోటారు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడి పాల్గొన్నారు.

విధివిధానాలపై జెడ్పీటీసీలకు శిక్షణ



జెడ్పీటీసీ పవిత్ర పాటిల్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

కోసిగి: పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జెడ్పీటీసీల విధులు, విధానాలు, బాధ్యతలపై మూడు రోజుల పాటు శ్రీకాళహస్తిలో శిక్షణ ఇచ్చారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన శిక్షణలో కర్నూలు జెడ్పీ సీఈఓ, డీపీఆర్సీ ప్రిన్సిపాల్ నాసర రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని మొదటి విడతలో 25 మంది జెడ్పీటీసీలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న కోసిగి జెడ్పీటీసీ పవిత్ర పాటిల్‌కు ప్రశంస పత్రం అందజేశారు.